# ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి సిగ్గుచేటు

## మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేట, సెప్టెంబర్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యేలకే రక్షణ లేదని, ఇందుకు నిదర్శనమే హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ గూండాల దాడి అని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై జరిగిన కాంగ్రెస్ దాడిని గురువారం ఆయన తీవ్రంగా ఖండించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు దాడి చేయడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, పదేళ్లలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి రౌడీ పాలనను తీసుకొచ్చారని మండిపడ్డారు. ఎమ్మెల్యేకే రక్షణ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయమంటే దాడులకు పాల్పడుతారా.. అని నిలదీశారు. ఎమ్మెల్యేపై దాడి చేసిన నిందితులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సత్యవరపు సంపూర్ణ ఉన్నారు.

# అక్రమ అరెస్టుకు ఎంపీ వద్దిరాజు ఖండన


ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, సెప్టెంబర్ 12: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు చేసిన దాడిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అయితే, కౌశిక్‌రెడ్డిపై దాడిని వ్యతిరేకిస్తూ మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులతోపాటు తాను కూడా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వద్ద నిరసన చేపట్టినట్లు చెప్పారు. అయితే తమను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి కల్వకుర్తి వైపు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

# కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలి

## బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు


ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, సెప్టెంబర్ 12: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ గూండాలను తక్షణమే అరెస్టు చేయాలని బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పట్టపగలే ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయడం, ఎమ్మెల్యేపై హత్యాయత్నం చేయడం అంటే రాష్ట్రం ఎటుపోతోందని ప్రశ్నించారు. ఫ్యాక్షన్‌కు, రౌడీ రాజకీయాలకు తెలంగాణను అడ్డాగా మార్చేస్తుండడం బాధాకరమని అన్నారు. కౌశిక్‌రెడ్డిని గృహనిర్బంధంలో ఉంచి గూండాలతో దాడి చేయిస్తారా అంటూ ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఎమ్మెల్యేకు కూడా రక్షణ లేకపోవడమేనా అంటూ దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయపరంగా పోరాడుతున్నందునే కౌశిక్‌రెడ్డిని టార్గెట్ చేశారని స్పష్టం చేశారు. ఇది కచ్చితంగా సీఎం రేవంత్‌రెడ్డి చేయించిన దాడేనని అన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఉడుత ఊపులకు బెదరబోమని స్పష్టం చేశారు. తదుపరి ఎన్నికల్లో కేసీఆర్‌ను జనాలు ఆశీర్వదిస్తారని అన్నారు.

# కౌశిక్‌రెడ్డిపై దాడి అప్రజాస్వామికం

## బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు


రేగా కాంతారావు

సారపాక, సెప్టెంబర్ 12 : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడాన్ని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఒక ప్రకటనలో ఖండించారు. ఇటీవల మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇంటిపై దాడి, ఖమ్మం వరద బాధితులను పరామర్శించడానికి వస్తే కారుపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలపై చట్టప్రకారం ఎందుకు చర్య తీసుకోవడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. దాడులు మాకు చేతకాక కాదు.. మా నాయకుడు ఆదేశిస్తే అగ్నిగుండమే అవుతుందని పేర్కొన్నారు. ఇలాంటి సిగ్గుమాలిన పనుల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గుతుందని, శాంతిభద్రతలు కాపాడలేని ప్రజా పాలన ఎందుకని, ఇది రాష్ట్ర భవిష్యత్‌కు మంచిది కాదని హితవు పలికారు. ఈ దాడులన్నీ సీఎం రేవంత్ కనుసన్నల్లోనే జరుగుతున్నాయని, దీనికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారం ఎవరి సొత్తు కాదని, భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదేనని ఆయన పేర్కొన్నారు.

# స్థానికం కోసం ఓటర్ల జాబితా

- నేడు పరిషత్, పంచాయతీల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్
- 14 నుంచి 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న ఓటర్ల తుది జాబితా విడుదలకు ఏర్పాట్లు


డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల కోసం ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్న మండల అధికారులు


ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్న లక్ష్మీదేవిపల్లి మండల అధికారులు

**భద్రాద్రి జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా..**

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు |
|---|---|
| పినపాక | 1,98,402 |
| ఇల్లెందు | 2,19,569 |
| కొత్తగూడెం | 2,43,846 |
| అశ్వారావుపేట | 1,55,961 |
| భద్రాచలం | 1,48,661 |
| మొత్తం ఓటర్లు | 9,66,439 |

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : సర్పంచ్‌ల పదవీ కాలం ఇప్పటికే ముగిసినందున పల్లెపోరు కోసం అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం ముందస్తుగానే ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన ఓటర్ల జాబితా ప్రకారమే పంచాయతీల పరిధిలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నారు. వారం రోజుల ముందుగానే డ్రాఫ్ట్ విడుదల చేయాల్సి ఉండగా.. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను వాయిదా వేసింది. దీంతో శుక్రవారం డ్రాఫ్ట్ విడుదల చేయడానికి భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి జిల్లాలో 481 పంచాయతీల పరిధిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కావడంతో ఆయా పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. పంచాయతీల్లో నిధుల లేమి అంశం ప్రత్యేకాధికారులకు తలనొప్పిగా మారడంతో అధికారులు అటువైపు చూడడం లేదు. కేవలం సమావేశాలకే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది.

### నేడు డ్రాఫ్ట్ నోటిఫికేషన్..

గత అసెంబ్లీ ఎన్నికల్లో తయారు చేసిన ఓటర్ల జాబితా ప్రకారం పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితాను వార్డుల వారీగా సిద్ధం చేశారు. 481 గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేసి ఆయా గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డుల్లో ఉంచనున్నారు. దీంతోపాటు మండల పరిషత్ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉంచుతారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి జిల్లా కార్యాలయంలో సిబ్బందితో డ్రాఫ్ట్‌పై కసరత్తు చేసి తుదిరూపునకు తీసుకొచ్చారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 21 వరకు పంచాయతీ కార్యాలయాల్లో స్వీకరించడానికి సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు.

### 28న తుది జాబితా..

ఈ నెల 14 నుంచి అభ్యంతరాలు తీసుకున్న తర్వాత 26న డీపీవో వాటిని పరిష్కరిస్తారు. ఆ తరువాత తుది జాబితాను పూర్తిచేసి 28న ప్రకటిస్తారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఓటర్ల తుది జాబితాను అధికారికంగా వెల్లడిస్తారు.

# రెండో రోజూ కేంద్ర బృందం పర్యటన

- ఖమ్మంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టతీవ్రత పరిశీలన
- కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్న బృంద బాధ్యులు


ఖమ్మం మోతీనగర్‌లో దెబ్బతిన్న సమూదాయాలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద అధికారులు


ఖమ్మం రూరల్ మండలం రాజీవ్‌గృహకల్పలో పర్యటిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, కలెక్టర్


ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 12: ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర బృంద అధికారులు రెండో రోజు గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అడ్వైజర్ కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలో కేంద్ర అధికారులు మహేశ్‌కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్‌కే కుష్వాహ, టీ.నియాల్ కన్సన్, డాక్టర్ శశివర్ధన్‌రెడ్డిలతో కూడిన కేంద్ర బృంద సభ్యులు ముగ్గురు చొప్పున రెండు బృందాలుగా ఏర్పడి జిల్లాలో పర్యటించారు. మొదటి బృంద సభ్యులు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి రాజీవ్ గృహకల్ప, ఖమ్మం కాల్వొడ్డు, బొక్కలగడ్డ, ప్రకాశ్‌నగర్ మున్నేరుబ్రిడ్జి, మోతీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. రెండో బృంద సభ్యులు ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెం, తల్లంపాడు – తెల్దారుపల్లి, తనగంపాడు, ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లో పర్యటించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్నేరు ఉధృతి ఎలా ఉందో, ప్రవాహం ఏ మేరకు వచ్చిందో, ప్రవాహం ఎంత సమయం మేర నిలిచిందో అనే అంశాలను ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కేంద్ర బృందానికి వివరించారు. నష్ట వివరాలను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కేంద్ర బృందానికి చూపించారు. ఈ సందర్భంగా బాధితులు కేంద్ర అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇళ్లు దెబ్బతిన్నాయని, సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిపోయామని మొరపెట్టుకున్నారు. రాష్ట్ర గనులు, భూగర్భ ఖనిజాల శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ కూడా పర్యటించి నష్ట తీవ్రతను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృంద ఇన్‌చార్జి కల్నల్ కేపీ సింగ్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదల విధ్వంసాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించామని, ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా నాటి విలయాన్ని గమనించామని అన్నారు. నష్టం తీవ్రతపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఆర్డీవోలు గణేశ్, రాజేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఖమ్మం రూరల్లో..

రాజీవ్ గృహకల్ప, జలగంనగర్‌లో పర్యటించిన కేంద్ర బృంద అధికారులు మున్నేటి వరదకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. నష్టం తీవ్రత గురించి కేంద్ర బృందానికి ఖమ్మం కలెక్టర్ ఖాన్ వివరించారు. గృహకల్పలో మొత్తం 33 బ్లాకుల్లో 320 కుటుంబాల వారు నివసిస్తున్నారని, మున్నేటి నుంచి ఆకస్మికంగా వరద రావడంతో ఇక్కడి ప్రజలందరూ కట్టుబట్టలతో బయటకు వెళ్లారని అన్నారు. ఇంటి సామాన్లన్నీ వరదలో కొట్టుకపోయాని, మరికొన్ని వస్తువులు బురదమయమయ్యాయని వివరించారు. తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్, ఎంపీవో రాజారావు పాల్గొన్నారు.

# భద్రాచలం వద్ద శాంతించిన గోదావరి

## మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించిన అధికారులు


భద్రాచలం వద్ద నిలకడగా గోదావరి నీటి ప్రవాహం

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 12 : ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి తగ్గడంతో భద్రాచలం వద్ద గోదారమ్మ శాంతించింది. నీటి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. గురువారం ఉదయం 6 గంటలకు 44.3 అడుగుల వద్ద ఉన్న గోదావరి ప్రవాహం 11 గంటలకు 42.7 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. ఎగువన వర్షాలు తగ్గడం.. వరద తీవ్రత ఆగిపోవడం.. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టులతోపాటు సమ్మక్క, సారలమ్మ బ్యారేజీ వద్ద వరద ఉధృతి తగ్గడంతో తాలిపేరు ప్రాజెక్టు వద్ద కూడా వరద ప్రవాహం క్రమక్రమంగా తగ్గుతూ వచ్చింది. భద్రాచలం వద్ద సాయంత్రం 4 గంటలకు 41.70 అడుగులకు నీటిమట్టం చేరుకోవడంతో ప్రవాహం నిలకడగా ఉంది. శబరి వద్ద వరద ఉధృతి తగ్గి గోదావరి శాంతించడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు వాహనాల రాకపోకలను అధికారులు పునరుద్ధరించే అవకాశం ఉంది.

# కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

- వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్
- కేంద్రం రూ.10 వేల కోట్లు విడుదల చేయాలి : ఎమ్మెల్యే కూనంనేని


కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 12 : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భారీ నష్టం వాటిల్లిందని, ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతులు, లోతట్టు ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని, ఈ విపత్కర పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన సహాయం చేస్తున్నదని, నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసినప్పుడు రూ.5,644 కోట్లుగా తేలిందని, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటన లెక్కల ప్రకారం నష్టం రూ.6 వేల కోట్లుగా తేలిందన్నారు. అట్టి మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో మున్నేరు వరదతో వేలాది ఇళ్లు దెబ్బతిన్నాయని, ప్రజలు కట్టుబట్టలతో మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎకరా పంట నష్టానికి రూ.10 వేలు, దెబ్బతిన్న ఇంటికి రూ.16,500 చొప్పున ఇస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేలు, ఇళ్లకు రూ.50 వేల చొప్పున ఇవ్వాలని, వరదల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, సారయ్య, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాసరావు, మున్నా లక్ష్మీకుమారి, సలీం, రేసు ఎల్లయ్య, సలిగంటి శ్రీనివాస్, ఏపూరి బ్రహ్మం, దేవరకొండ శంకర్, వాసిరెడ్డి మురళి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

# 'నా ఖమ్మం కోసం నేను'కు రూ.11 లక్షల విరాళాలు

## ప్రజల భాగస్వామ్యంతో విరివిగా బియ్యం, దుస్తుల సేకరణ: ఖమ్మం కలెక్టర్


కూసుమంచి వినాయక హుండీలో విరాళం వేస్తున్న జడ్పీ సీఈవో (ఫైల్)

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 12: జిల్లాలో వరద బాధితుల సహాయార్థం చేపట్టిన 'నా ఖమ్మం కోసం నేను..' అనే కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ప్రజల నుంచి చేపడుతున్న విరాళాలు, ఉపయోగ వస్తువుల సేకరణకు మంచి స్పందన వస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరద బాధితుల సహాయం అందించేందుకు వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా జిల్లాలోని గణేశ్ మండపాల వద్ద 'నా ఖమ్మం కోసం నేను..' పేరిట హుండీలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. వీటికి మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు రూ.11.20 లక్షలు సమకూరినట్లు వివరించారు. వీటితోపాటు 7,419 కిలోల బియ్యం, 1,230 జతల దుస్తులు, 9 బ్లాంకెట్లు, 75 నోట్ పుస్తకాలు, రెండు జతల చెప్పులు, రెండు ఇతర వస్తువులు సమకూరినట్లు వివరించారు.

# గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

## చిన్న ఘటనకూ ఆస్కారం లేకుండా ఏర్పాట్లు: ఖమ్మం సీపీ


వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 12:గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరుగకుండా కచ్చితమైన ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఖమ్మం సీపీ సునీల్ దత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న జరిగే గణేశ్ నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లపై జిల్లాలోని పోలీస్ అధికారులతో ఖమ్మంలోని తన కార్యాలయం నుంచి గురువారం ఏర్పాటుచేసిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఏ చిన్న ఘటనకూ ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇందు కోసం ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, క్రేన్లు ఏర్పాటుచేయాలని, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, పడవలను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్, మున్సిపల్, పంచాయతీ రాజ్, మత్స్యశాఖ అధికారులతో సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. భక్తులు, నిర్వాహకులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. వర్షాలు ఎక్కువగా ఉన్నందున నిమజ్జన కార్యక్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 27 వేల గణేశ్ విగ్రహాలు నమోదయ్యాయని, ఇప్పటి వరకు 243 విగ్రహాలు నిమజ్జనమయ్యాయని వివరించారు. అడిషనల్ డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాదరావు, ఏసీపీ సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో నాడిపట్టేదెవరు?


- దుమ్ముగూడెం, నర్సాపురం పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కొరత
- ఖాళీగా దర్శనమిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ కుర్చీలు
- పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతున్న ప్రజలు


ఓపీ కోసం వచ్చిన రోగులు

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 12 : ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సిబ్బంది కొరత వేధిస్తున్నది. వర్షాకాలంలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది ఉంటేనే నిత్యం జ్వరాలు, వివిధ వ్యాధులతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందేది. అయితే ఏజెన్సీ ప్రాంతంలోని దుమ్ముగూడెం, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నది. దీంతో వైద్యం కోసం వచ్చే రోగులకు అంతంత మాత్రంగానే వైద్య సేవలు అందుతున్నాయి. నర్సాపురం పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. దుమ్ముగూడెం పీహెచ్‌సీలో మెడికల్ అధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ముగ్గురు ఏఎన్‌ఎంలు, స్వీపర్, పర్ణశాల పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు, ముగ్గురు ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సాపురం పీహెచ్‌సీలో సీబీపీ మిషన్ అందుబాటులో ఉన్నప్పటికీ పని చేయడం లేదు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉండడంతో టీ హబ్ ద్వారా రక్త పరీక్షల నిర్ధారణ కోసం రోగులను కొత్తగూడెం పంపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయా పీహెచ్‌సీల్లో పోస్టులు ఖాళీగా ఉండడంతో కొందరు ఏఎన్‌ఎంలు అన్నీ తామై వ్యవహరిస్తూ అరకొరగా రోగులకు రక్త, ఇతర పరీక్షలు నిర్వహిస్తున్నారు.

### ఆధునిక పరికరాలు ఉన్నా..

ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా పీహెచ్‌సీల్లో ఆధునిక వైద్య పరికరాలు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో రోగులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. సీబీపీ మిషన్ అందుబాటులో ఉన్నా నిర్ధారణ పరీక్షల కోసం కొత్తగూడెం టీ హబ్‌కు వెళ్లాల్సి రావడంతో రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నర్సాపురం, దుమ్ముగూడెం, పర్ణశాల పీహెచ్‌సీల పరిధిలోని వంద గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు చేయాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు ఈ పీహెచ్‌సీల నుంచి మందుల కొరత ఉండడతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో బయట మందులు కొనుక్కునే దుస్థితి ఏర్పడిందని ఏజెన్సీ గ్రామాల రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని, మందుల కొరత లేకుండా చూడాలని, ఆధునిక పరికరాలు ఉపయోగంలోకి తేవాలని ఏజెన్సీ ప్రాంత రోగులు కోరుతున్నారు.


దుమ్ముగూడెం పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

# వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంవో


పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరమణ

బోనకల్లు, సెప్టెంబర్ 12 : వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిస్ట్రిక్ట్ మలేరియా అధికారి(డీఎంవో) డాక్టర్ వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం సందర్శించిన ఆయన.. పలు రికార్డులను పరిశీలించారు. డ్రై డే, ఫీవర్ సర్వే తదితర కార్యక్రమాలపై డాక్టర్ స్రవంతిని అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ పాజిటివ్ కేసులు వచ్చిన వాటి ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఫీవర్ సర్వే, ప్రతి శుక్ర, మంగళవారాల్లో గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో వెంకట్రావుయాదవ్, డాక్టర్ స్రవంతి, సీహెచ్‌వో శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ దానయ్య, నర్సింగ్ ఆఫీసర్ ఉదయశ్రీ, ఫార్మాసిస్ట్ రాధాలత, స్టాఫ్‌నర్స్ రమాదేవి పాల్గొన్నారు.

# సెక్యూరిటీ గార్డులకు ముగిసిన శిక్షణ


ప్రతిభావంతులను అభినందిస్తున్న సెక్యూరిటీ జీఎం

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 12: సింగరేణి ఎస్ అండ్ పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో 46వ బ్యాచ్ సెక్యూరిటీ సిబ్బందికి ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో సెక్యూరిటీ జీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సింగరేణిలో అత్యధిక మరణాలు కేవలం రోడ్డు ప్రమాదాల కారణంగానే జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు భద్రత నియమాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. శిక్షణలో ప్రతిభ చూపిన రాంమోహన్‌రావుకు, శ్రీనివాస్‌కు బహుమతులు అందజేసి అభినందించారు.